# టీ బోటు

"బోటులో వచ్చాం. సాయంత్రం ఆరు గంటలకు మీరిద్దరూ పెద్ద కాలవ వంతెన దగ్గరకు రావలసింది"— వెంకట్రావు.

ఆ చీటీ క్లాసులో ఉండగా ఒక కుర్రవాడు తెచ్చి ఇచ్చాడు. కాళ్ళు నిలవడంలేదు. రామారావు ఎక్కడున్నాడో కబురందించాలి.

పరధ్యానంగా—క్లాసులో పిల్లలడిగిన ప్రశ్నకు – 'పెద్దకాలవ' అని సమాధానం చెబితే గొల్లున నవ్వారు.

ఐదు అయింది; రామారావు కోసం వెతికాను, కనిపించలేదు. గంట కొట్టారు. బడి విడిచిపెట్టారు. గేటు దగ్గిర రామారావు పి. యస్.తో మాట్లాడుతున్నాడు. పి. యస్. శుద్ధ ఖద్దరు మనిషి, ఎదట ఒక్క మనిషి వున్నా మరిచిపోయి, 'సోదర సోదరీమణులారా!' అని ప్రారంభించ గలడు.

మెల్లగా దగ్గరకుచేరి రామారావు చేతిలో చీటీ వుంచాను. చూశాడు. 'ఓహో బాగుంది. పి.యస్.గారూ మనతో వస్తారు.' ఉపన్యాసం ఆపించి ఆయన్నుకూడా బోటు దగ్గరికి పట్టుకుపోయాం. పురుషసూక్తంలో చెప్పినట్టు 'నాన్యః పన్థా—అయనాయ విద్యతే' అది ఒక్కటే శరణ్యం!

ముగ్గురం పెద్దకాలవ దగ్గరకి వెళ్ళాం. ధవళేశ్వరం దగ్గర చీలిన గోదావరి కాలవ రామచంద్రపురం పక్కగా కాకినాడ వెడుతుంది. ఆ కాలవకు రామచంద్రపురం దగ్గర పెద్ద వంతెన.

సాయంత్రం ఆరు గంటలయింది.

వంతెనదగ్గర దిగువగా పెద్దపెద్ద సిరిసెపు చెట్లు, దాన్ని సంస్కృతం లోకి మారిస్తే శిరీషం కావచ్చు. కాని చుట్టుపక్కలవాళ్ళు వాటిని నిద్ర గన్నేరు చెట్లు అంటారు. వాటి పువ్వులు సుకుమారమైన ఎరుపు, తెలుపు రంగులు కూడిఉంటాయి. కేసరాలు ముట్టుకుంటే రాలిపోతాయి. అవంటే— కాళిదాసుకు ఎంత ఇష్టమో. 'శిరీష పుష్పాధిక సౌకుమార్యా' అని స్త్రీ లాలిత్యంతో పోలుస్తాడు.

ఆ చెట్ల నీడల్లో కాలవ చల్లగా సాగిపోతూ ఉంటే సాయంకాలాలు అక్కడ కూర్చుని, కాలవలో పడి తేలిపోయే సిరిసెపు పువ్వులు చూడడం కంటికి చెప్పలేనంత సుఖం. ఎర్రని పెదవులమీద తెల్లని నవ్వులతో కన్నెపిల్లలు ఈదులాడుతూన్నట్టుంటుంది.

టీ బోటు ఆ నీడల్లో ఆగి ఉంది.

నాటుపడవలా కాకుండా తెల్లని రంగుతో స్వచ్ఛంగా, చూడ ముచ్చటగా వుంది ఆ పడవ! కాలవపక్క పల్లెటూరి పరిభాషలో దాన్ని 'దొరబోటు' అంటారు.

మమ్మల్ని చూడగానే వెంకట్రావు నవ్వుతూ పడవలోనుంచి బయటికివచ్చి ఆహ్వానించాడు.

వెంకట్రావు ఒక టీ కంపెనీకి 'రిప్రెజెంటేటివ్'గా పని చేస్తున్నాడు. అతని అల్లుడు అతనికి అసిస్టెంటు. అల్లుడు మాకు ఆతిథ్యం ఏర్పాటు చేస్తున్నాడు. వాళ్ళిద్దరినీ చూడగానే - నాకు సత్యనారాయణ వ్రతకథలో అల్లుడు, మామలు జ్ఞాపకం వచ్చారు.

అల్లుడు మామలు వర్తక వ్యాపారాల్లో సంపాదించిన ధనమంతా అనేక వస్తురూపాల్లో వేసుకుని పడవలో వస్తున్నారు. ఒక పేద బ్రాహ్మడు వారి పడవ దగ్గరకువచ్చి ఏమైనా ధన సహాయం చెయ్యమని అడిగాడు. మామ పరమ లోభి. 'వెళ్ళవయ్యా, పడవలోదంతా డబ్బనుకున్నావా? ఆకూ, అలమూ' అన్నాట్ట. బ్రాహ్మడు నవ్వాడు-అంతే-బరువైన వస్తువులతో నూటికి నీటిలో సగం మునిగి ఉన్న పడవ తెప్పున తేలిపోయింది. పెద్ద వైశ్యుడు లబోదిబోమని కాళ్ళుపట్టుకుంటే బ్రాహ్మడు సత్యనారాయణ మూర్తిగా దర్శనమిచ్చి "అబద్ధాలు చెప్పకు. త్యాగం లేనిదే ధనం పెరగదు" అని బుద్ధిచెప్పి వెళ్ళిపోయాడని కథ___

మా వెంకట్రావుకు ఆ భయం లేదు. సత్యనారాయణమూర్తే కాదు వైకుంఠంలోని-'నగరి వా రాబాల గోపాలమున్' వచ్చినా పడవలో ఉన్న దంతా ఆకూ అలమే అని ఢంకా బజాయించి చెప్పగలడు. ఎంచేతంటే అందులో పేక్ చేసి ఉన్నదంతా ఒకటో రకమైన టీ లీఫ్ (తేయాకు అలమే ఉన్నది.) చక్కగా సత్యనారాయణమూర్తినీ పరివారాన్ని కూర్చోబెట్టి-పది కప్పుల శుభ్రమైన టీ కలిపించి ఆతిథ్యమిచ్చి-'స్వామీ, రెండు పాకెట్లు తమదగ్గర ఉంచండి' అని ఇచ్చి పంపేవాడు.

బాగా చల్లబడింది. సందె వెన్నెల వస్తోంది. అల్లుడు ట్రేలో

నాలుగు కప్పులు మంచి టీ-రెండు బిస్కట్ పాకెట్లు, పంపాడు. తప్పకుండా అటువంటి అల్లుడు అందరికీ ఉండుగాక అని మనసులో ఆశీర్వదించి టీ కప్పు లందుకున్నాం-మేలుజాతి బిస్కట్ల అనుపానంతో టీ సేవించాం.

సందె వెన్నెల చల్లగా సిరిసెపు చెట్ల ఆకులలోంచి మా మీద పడుతోంది.

ప్రియురాలి స్పర్శలా చల్లగాలి తిరిగింది. ఏమీ ఎరగని సుద్దలాంటి వాడికే పాడుతూ గంతులు వేయాలనిపించే సమయం అది—

రసజ్ఞత, సంస్కారం, కళాభిరుచీ కలవారి మాట చెప్పేదేమిటి?

వెంకట్రావు కాలకర్మవశాత్తు టీ యాజమాన్యం వహించాడుగాని సహజంగా మంచి భావుకుడు, కవితాభిమాని. పాటగాని, పద్యంగాని చక్కగా అనగలడు.

"ఎన్నెలంటే పాట కెంత మనుసౌతాదో
పాట సాగేతలికి పయన మేమవుతాదో
ఆపలేనే యెంకి ఈ పడవ యిసురూ
పాడలేనే యెంకి పదములీ రొదలో—"

అని సన్నగా అంటుకున్నాడు.

ఆ సన్నని రాగానికి వెన్నెల కదుల్తోంది. గాలి ఊగుతోంది. రెండు మూడు సిరిసెపు పువ్వులు మా తలమీద పడ్డాయి.

కాలవవేపు చూస్తే 'యెలుతురంతా మేసి యేరు నెమరేసింది'

అన్న మాటలు జ్ఞాపకం వచ్చి మనసు కలవళపడింది. ఉనికి మరిచిపోయి అలా కూర్చున్నాం కొంతసేపు.

వెంకట్రావు కదిలి అన్నాడు-భోజనాలు ఇక్కడే ఏర్పాటు చేశాను. చేసి వెడుదురుగాని-అని పట్టుబట్టాడు.

'ఏర్పాట్లన్నీ అయాయి. రావచ్చు' అని పడవలోనుంచి పిలుపు.

పడవ మధ్య భాగంలో చక్కగా అరిటాకులు పరిచి ఒక స్వీటు, రెండు కూరలు వగైరా వడ్డనలు సిద్ధంగా ఉన్నాయి. కబుర్లు, నవ్వులు, పరాచికాలతో భోజనాలవుతున్నాయి. ఇద్దరు కుర్రాళ్ళు-మెరికల్లాటి వాళ్ళు తెల్లని-శుభ్రమైన దుస్తులతో వడ్డన సాగిస్తున్నారు.

ఒక కుర్రాడు నాదగ్గర మరి కాస్త స్వీటు వెయ్యబోయాడు! నేను నవ్వుతూ "లఘు, లఘు" అన్నాను. వెంకట్రావు పకాపకా నవ్వుతూ "శాస్త్రీ! మా వాళ్ళకు సంస్కృతం రాదు, తెలుగులో చెప్పు" అన్నాడు. ఆలోచిస్తున్నాను.

వెంకట్రావు గంభీరంగా "వంట-ఎలావుంది?"

"అద్భుతం" అన్నాను.

"రామాయణమంత బాగుండకదూ .... శ్రీవాల్మీకులపాకం కనకనే అంత రుచి వచ్చింది" అన్నాడు.

నేను సాభిప్రాయంగా నవ్వుతూ—

—"బ్రహ్మకృపా హి కేవలమ్"—అని ముగించి లేచాను.